క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న మండల నాయకులు

రెబ్బెన: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ధోని శ్రీశైలంను బుధవారం మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు గోలేటిలో శాలువాతో సన్మానించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ ఇంట్లో నూతన జిల్లా అధ్యక్షుడిని సన్మానించారు. మండలంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై మాట్లాడారు. నాయకులు నవీన్‌గౌడ్, ప్రసాద్, మోకుదెబ్బ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు నాగభూషన్‌గౌడ్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

కౌటాల: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని వీర్దండి గ్రామంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలను ఎండిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు పెంచాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఇంటర్వ్యూ తేదీల్లో మార్పులు

రెబ్బెన: రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూల తేదీల్లో కొన్ని మార్పులు చేసినట్లు ఎంపీడీవో శంకరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలను ఈనెల 15లోపే పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని దరఖాస్తుదారులకు నిర్వహించే ఇంటర్వ్యూల తేదీల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. మార్పులు చేసిన తేదీల ప్రకారం గురువారం వంకులం, రాంపూర్, నవేగాం, కైరిగాం, 9న కొండపల్లి, గంగాపూర్, కొమురవెల్లి, 12న పులికుంట, తక్కళ్లపల్లి, రాజారాం, ధర్మారం, లక్ష్మీపూర్, రోళ్లపహాడ్, 13న కిష్టాపూర్, నారాయణపూర్, 14న నంబాల, జక్కులపెల్లి, పాసిగాం, 15న తుంగెడ, మాద్వాయిగూడ పంచాయతీ పరిధిలో అన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని దరఖాస్తుదారులు విషయాన్ని గమనించి గ్రామపంచాయతీల వారీగా కేటాయించిన తేదీల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

పోడు వ్యవసాయం చేసిన వ్యక్తిపై కేసు

బెజ్జూర్: పోడు వ్యవసాయం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని పెద్దసిద్దాపూర్ గ్రామానికి చెందిన మేస్రం శంకర్ సిద్దాపూర్ శివారులో ఎకరన్నర భూమిలో పోడు వ్యవసాయం చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు. పోడు వ్యవసాయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి సన్మానించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఆశ్రమ పాఠశాలలకు చెందిన అపర్ణ 547, కాసుబాయి 534, నిర్మల 534, వైద్యనాథ్ 519 మార్కులతో సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్ పాల్గొన్నారు.

శిథిల భవనంలో గ్రంథాలయం

- వర్షానికి ఉరుస్తున్న పైకప్పు
- తడిసిముద్దవుతున్న పుస్తకాలు
- చెడిపోతున్న ఫ్యాన్లు, బీరువాలు
- ఖాళీగా పాత పోలీస్‌స్టేషన్ భవనం
- అక్కడకు మార్చాలని మండల వాసుల వేడుకోలు



నిరుపయోగంగా పోలీస్‌స్టేషన్ పాత భవనం

రెబ్బెన: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు అని ఊరికే అనలేదు పెద్దలు. పుస్తకాల పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవచ్చు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షల్లో రాణించేలా అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచే గ్రంథాలయాలు నేడు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీసం పక్కా భవనాలు కూడ అందుబాటులో లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా గదులు అందుబాటులో లేక ఒకటి రెండు గదులతో సతమతమవుతున్నారు. పుస్తకాలను భద్రపర్చేందుకు కూడ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో చెదలు బారిన పడి విలువైన పుస్తకాలు చెడిపోతున్నాయి. దాంతో ఖాళీగా ఉన్న పాత భవనాలను ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటాయని మండలవాసులు కోరుతున్నారు.

నిరుపయోగంగా పాత పోలీస్‌స్టేషన్ భవనం

మండల కేంద్రంలో కొనసాగుతున్న శాఖా గ్రంథాలయానికి కనీసం పక్కా భవనం కూడ అందుబాటులో లేదు. కమ్యూనిటీ భవనంలో ఎన్నో ఏళ్లగా గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఈ భవనంలో గదుల కొరతతో ఇరుకుగా ఉన్న రెండు చిన్నపాటి గదుల్లోనే గ్రంథాలయాన్ని నెట్టుకొస్తున్నారు. పాఠకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్న రెండు గదుల్లో నుంచి ఒక గదిని పాఠకుల కోసం కేటాయించగా మరో చిన్నగదిని స్టోర్‌రూంగా ఉపయోగిస్తున్నారు. దాంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రం నడిఒడ్డున గతంలో పోలీస్‌స్టేషన్‌ను నిర్వహించిన భవనం ప్రస్తుతం ఖాళీగా ఉంది. పోలీస్‌స్టేషన్‌ను రెండున్నర సంవత్సరాల క్రితం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి పాత పోలీస్‌స్టేషన్ భవనం నిరుపయోగంగా మారింది. భవన నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో కళావిహీనంగా మారింది. అయితే విలువైన భవనాన్ని వృథాగా వదిలేయకుండా పక్కా భవనం లేని గ్రంథాలయం కోసం కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల వాసులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ దృష్టికి సైతం మండలానికి చెందిన నాయకులు, యువకులు తీసుకెళ్లారు.

శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ భవనం..

ప్రస్తుతం గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్న కమ్యూనిటీ భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకుంది. దాంతో వర్షాకాలం పైకప్పు స్లాబు ఉరుస్తుండంతో పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో 200 పైచిలుకు పుస్తకాలు తడిచి పాడైపోయాయి. ఫ్యాన్లు, బీరువాలు సైతం తడిచి చెడిపోతున్నాయి. దాంతో ఏ క్షణాన పైకప్పు ఊడి కిందపడిపోతుందోనని పాఠకులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రంథాలయంలో 4731 పుస్తకాలు ఉండగా 490 మంది డిపాజిట్‌దారులు ఉన్నారు. ప్రతిరోజు గ్రంథాలయంలో పుస్తకాలు, దినపత్రికలు చదివేందుకు సుమారు 35 నుంచి 50 మంది పాఠకులు వస్తుంటారు. పోటీ పరీక్షలు ఉన్న సమయంలో రోజువారీగా వచ్చే పాఠకుల సంఖ్య మరింత పెరుగుతుంది. పాఠకుల నుంచి మంచి ఆదరణ ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు మాత్రం గ్రంథాలయం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వర్షాకాలంలో మరింత ఇబ్బంది

ప్రస్తుతం గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న భవనంతో వర్షాకాలం చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. పైకప్పు స్లాబు వర్షానికి ఉరుస్తోంది. దాంతో పాఠకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పుస్తకాలు, ఇతర వస్తువులు తడిసి పాడైపోతున్నాయి. గ్రంథాలయానికి స్థలం లేకపోవడంతో పక్కాభవనం మంజూరు కావడం లేదు. దాంతో ఇరుకుగా ఉన్న చిన్న గదిలోనే గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నాం.

– స్వర్ణలత, లైబ్రేరియన్

యూనిఫాం సిద్ధం చేయాలి



యూనిఫాంలు పరిశీలిస్తున్న సీఎంవో మధుకర్

లింగాపూర్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మే 15వ తేదీ లోగా ఒక జత యూనిఫాంలు సిద్ధం చేయాలని సీఎంవో మధుకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సీఎంవో సందర్శించారు. ఆయన మహిళలతో మాట్లాడుతూ విద్యార్థుల యూనిఫాంలను సరిపోయేలా నిర్దిష్టమైన కొలతలతో కుట్టాలని సూచించారు. సమయానికి పిల్లలకు యూనిఫాం అందేలా చూడాలన్నారు. మండల సమాఖ్య సంఘం సభ్యులు కరుణ, సుమన్‌బాయి, సరోజాబాయి తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

ఆసిఫాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రులను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లోని అన్ని వార్డులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు వినోద్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం కోసం భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: మండల కేంద్రంలో గ్రంథాలయం కోసం స్థానిక పాత గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ భవనాన్ని బుధవారం ఎంపీడీవో రమేశ్, గ్రంథాలయం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర గ్రంథాలయం చైర్మన్ రియాజ్ అహ్మద్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు భవనం పరిశీలించినట్లు తెలిపారు. కౌటాల గ్రంథాలయం గత 30ఏళ్లు శిథిలభవనంలో కొనసాగుతుందని, రానున్న వర్షకాలంలో పాత భవనంలో గ్రంథాలయం నిర్వహించడం సాధ్యం కాదని అధికారుల విన్నపం మేరకు వేరే ప్రభుత్వ భవనంలో మార్చుతామని తెలిపారు. మండలంలోని నిరుద్యోగులకు మంచి గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. భవన పరిస్థితి, మరమ్మతుల నివేదికలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట గ్రంథాలయం అధికారి ప్రవీణ, ఏపీఎం ముక్తేశ్వర్, ఏపీవో మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆసుపత్రిలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆసుపత్రి ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి ప్రతీనెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకులు రాజుబాయి, సాయిబాబు, షరీఫ్, ఇజార్ హుస్సేన్, సందీప్, బీమేశ్, సిద్ధార్థ, రవి, పవన్, సరిత, పద్మ, పుష్ప, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీటీడీవో రమాదేవి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు సత్తా చాటాయన్నారు. 13 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఏటీడీవో చిరంజీవి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఆసిఫాబాద్: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన బాబాపూర్, కల్వాడ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అనూష, లోకేశ్‌లను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అభినందించారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలోగల ఎమ్మెల్యే నివాసంలో విద్యార్థులను శాలువాతో ఎమ్మెల్యే సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. మొబైల్‌ఫోన్‌లకు అలవాటుపడి చదువుకు దూరం కావద్దని, ఉన్నతమైన స్థాయిలో నిలిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేరు నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రమాదేవి, ఆశ్రమ పాఠశాల అధికారులు ఉద్ధవ్, శకుంతల, ఖమర్ హుస్సేన్, చిరంజీవి, శ్రీనివాస్, గోపి, భారతి, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు



కోదండ రామాలయంలో..

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి



పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

బెజ్జూర్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ మాత జయంతి సందర్భంగా బుధవారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బెజ్జూర్ మండల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్అర్బన్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని ఆలయ కమిటీ, వాసవిక్లబ్‌ల ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ముదిగొండ రాజశేఖర్‌శర్మ, వారణాసి సంతోష్‌శర్మల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, 10.30 గంటలకు కుంకుమపూజ, మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలో వాసవీమాత ఉత్సవ విగ్రహంతో కనుల పండువగా శోభాయాత్రను బాజాభజంత్రీలు, డీజే చప్పుళ్లతో ఘనంగా నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రావుల శంకర్, శ్రీనివాస్, ప్రమోద్, వినేశ్, బాలేశ్వర్, దిలీప్, మురళి, వెంకన్న, వివేక్, వేణు, శ్రీధర్, మహేశ్, రమేశ్, నారాయణమూర్తి, మహేశ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో బుధవారం కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలిపోయిన ఇల్లు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఇల్లు దగ్ధమైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దంపూర్ గ్రామానికి చెందిన సురేశ్ ఇల్లు అగ్ని అంటుకుని పూర్తిగా కాలిపోయింది. ఇంటి పక్కనే ఉన్న వరిగడ్డికి మంటలు అంటుకోవడంతో పక్కనే ఉన్న ఇంటికి మంటలు వ్యాపించాయి. ఎవరో బీడి తాగి పడివేయడంతో ప్రమాదం జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు'

నార్నూర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, ఇందిరమ్మ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్, ఎంపీవో సాయిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి ఉన్నారు.

బీజేపీలోకి కొనసాగుతున్న వలసలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న అరిగెల సోదరులు

ఆసిఫాబాద్అర్బన్: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలోని తేలివాడ, గొల్లగూడ కాలనీవాసులు సుమారు 60 మందికి పైగా బుధవారం పార్టీ సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావ్, మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్‌ల ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో బీజేపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని, కేంద్రంలో ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై జిల్లాలోని వివిధ పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరడం శుభసూచికమన్నారు. శంకర్, గణేశ్, వెంకటేశ్, తిరుపతి, మల్లేశ్, బాలాజీ, సంతోష్, శ్రావణ్, ప్రకాశ్, రమేశ్, సుభాష్, మహేశ్, నాందేవ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటయ్య, ఎగ్గస్ శ్రీకాంత్, వెంకన్న, జయరాజ్, ప్రహ్లాద్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి




అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నేరడిగొండ: పంట సాగులో రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తలు, ఏఆర్‌ఎస్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామప్రసాద్, శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఏఓ కృష్ణవేణిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు అధిక మొత్తంలో పురుగుల మందులు వాడడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని తెలిపారు. పంట మార్పిడితో కలిగే లాభాలపై అన్నదాతలకు వివరించారు. తెగుళ్లు, రబీ, ఖరీఫ్ కాలంలో వేసే పంటలు, మిశ్రమ పంటల సాగు, నేల ఆరోగ్యం, కొత్త పంటల వివరాలు, వాతావరణ మార్పులు తట్టుకునే వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ రద్దు చేయాలని నిరసన

నార్నూర్: ఇందిరమ్మ ఇళ్ల కమిటీని రద్దు చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్‌లు మాట్లాడుతూ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రతిపాదించుకోవడం సమంజసం కాదన్నారు. కనీసం గ్రామ సభ కూడా నిర్వహించకుండా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారని ప్రశ్నించారు. వెంటనే కమిటీ రద్దు చేసి నిజమైన అర్హత ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. కాగా నిరసన కారణంగా రోడ్డుకిరువైపులా వాహనాలు భారీగా నిలిచి పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ రహీంపాషా సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులను బలవంతంగా పోలీసులు తరలించడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది.

పాఠశాలకు బెంచీలు వితరణ



బెంచీలు అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు మండలంలోని సలుగుపెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం 40 డ్యూయల్ డెస్క్ బెంచీలను నాయకులు అందజేశారు. సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలు అందించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బిక్షపతి, డిగంబర్, కొప్పుల దిలీప్ కుమార్, గట్టు తిరుపతి గౌడ్, మహేందర్, అల్లూరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.